1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

శుక్రవారం | మే 31, 2024 | www.navatelangana.com

హుండీ ఆదాయం రూ.3.74 లక్షలు



అసిస్టెంట్ కమిషనర్‌ను సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలోని మూడు రాష్ట్రాలకు పూర్తిగా సరిహద్దు లో గల సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.3,74,137 వచ్చినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్ ఆలయ అధికారి వేణు తెలిపారు. ఆలయ హుండీ గురువారం లెక్కించారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ హాజరయ్యారు. హుండీ లెక్కింపు తో పాటు బాన్సువాడ డివిజనల్ పరిధిలోని అన్ని మండలాల పరిధిలోగల ధూపాదీప నైవేద్య అర్చకులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అర్చకులు ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ కు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధూప దీప నైవేద్య అర్చకులు సలబత్పురాలయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు



ప్రభుత్వ ఉద్యోగులతో ఉద్యోగార్థులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ప్రభుత్వ ఉద్యోగమే ధ్యేయంగా పోటీ పరీక్షలకు సంసిద్ధమ వుతున్న ఉద్యోగార్థులకు గత నెల రోజుల నుంచి ప్రభుత్వ ఉద్యోగులు భీంగల్ గ్రంథాలయంలో ఉచిత మధ్యాహ్న భోజన వసతిని కల్పిస్తున్నారు. ఉద్యోగార్థులు ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు అరవింద్, శ్రీధర్, కళావతి, గంగ మహేష్‌లతో పాటు ఇతర ఉపాధ్యాయులు పోటీ పరీక్షలకు సంబంధించి పలు విషయాలను ఉద్యోగర్థులకు చక్కగా వివరించారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడేది సీఐటీయూనే

- ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆవిర్భావం నుంచి నేటి వరకు సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల హక్కులపై, సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సంఘం సీఐటీయూ అని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఈవీఎల్ నారాయణ అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పునస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970 సంవత్సరం లో ఐక్యత - పోరాటం నినాదంతో యూనియన్ ఏర్పాటైందని, అనేక పోరాటాలు రూప కల్పన తో కార్మిక వర్గం విజయాలు సాధించిందని అన్నారు. ప్రభుత్వాలు విద్యా, వైద్యం ప్రయివేటు చేయడం వలన కార్మిక వర్గం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కార్పొరేట్ శక్తుల కోసం ఆ చట్టాలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రయివేట్ చేయటం వలన నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని, ఫలితంగా రిజర్వేషన్ విధానాన్ని ప్రభుత్వం దెబ్బ తీస్తుందని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టాన్ని సవరించటంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని మండిపడ్డారు. హమాలీ, ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు కోసం కార్మికులు పోరాటాలు చేస్తున్నారని, సంక్షేమ బోర్డు సాధనకు కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజ్, జిల్లా నాయకులు మధు సుదన్, బాల దుర్గయ్య, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు మరిచారు

- నేలస్వభావం తెలియకుండానే పంటల సాగు
- విరివిగా యూరియా, పురుగుల మందుల వినియోగం
- పరీక్షలు చేయిస్తే.. సూచనలతో అధిక దిగుబడి



మట్టిపరీక్షలు చేస్తున్న చేస్తున్న అధికారులు (ఫైల్)

నవతెలంగాణ-లింగంపేట్

భూ సార పరీక్షలు.. నేల స్వభావం తెలిసి అందుకు అనుగుణంగా పంటలు, ఎరువులు వాడితే అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. అంతటి ప్రాధాన్యత ఉన్న మట్టి పరీక్షలను ప్రభుత్వాలు మరిచాయి. మూడేండ్ల క్రితం 2021లో మట్టి పరీక్షలు చేయగా.. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాని ఊసే ఎత్తడం లేదు. దీంతో నేల స్వభావం తెలియకుండానే పంటలు సాగవుతుండగా.. యూరియా, రసాయనిక మందులు సైతం విరివిగా వినియోగిస్తున్నారు. దీంతో భూసారం తగ్గిపోతూ పంటల దిగుబడులు తగ్గిపోతుండటంతో రైతులు నష్టపోతున్నారు.

ప్రతి సంవత్సరం వానకాలం యాసంగిలో కోతల ముగిసిన అనంతరం సాగు పనులు ప్రారంభించే నెల రోజులు ముందు ప్రతి రైతు తమ పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. 2021 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా భూసార పరీక్షలు చేశారు. వాటి ఫలితాల ఆధారంగా వ్యవసాయ అధికారుల సూచన మేరకు రైతులు పంటలు సాగు చేశారు. అధిక దిగుబడులను పొందారు. అయితే గత మూడేండ్లలో మట్టి పరీక్షలకు మంగళం పాడటంతో చేపట్టలేకపోతున్నారు.

రైతులకు సాగులో విప్లవాత్మక మార్పు తీసుకురావడానికి తమ రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. భూసారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ప్రస్తుతం అవసరం. భూసారం తెలిస్తే ఎరువులు వాడకాన్ని తగ్గించి దిగుబడులను పెంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇంతటి ప్రాముఖ్యం గల భూసార పరీక్షలను గత మూడు సంవత్సరాల క్రితం నిర్వహించారు. అప్పటినుండి ఇప్పటివరకు భూసార పరీక్షలు నిర్వహించడానికి వ్యవసాయ అధికారులు ముందుకు వచ్చిన రైతులు ముందుకు రాకపోవడంతో మట్టి పరీక్షలకు మంగళం పడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి రైతులకు పెద్ద పీట వేస్తున్నామని చెబుతుంది. ఈసారి నుంచి మట్టి పరీక్షలు చేపట్టేనా అని రైతులు ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సమీపిస్తుండడం వల్ల రైతులు దుక్కులు దున్ని ఎరువులు విత్తనాలు కొనుగోలు చేసుకుంటున్నారు.

నేల స్వభావం తెలియకుండానే పంటల సాగు..

రైతులు ఖరీఫ్ యాసంగి సీజన్లో నేల స్వభావము తెలవకుండానే పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో జిల్లా వ్యాప్తంగా 5 లక్షల 19 వేల 54 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ముఖ్యంగా వరి పంట జిల్లాలో 3 లక్షల 18 వేల 965 వరి పంట సాగు చేయనున్నారు. వరి పంట ముఖ్యంగా లింగంపేట్, బాన్సువాడ, నిజాంసాగర్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, బీర్కూర్, నసురుల్లాబాద్, రామారెడ్డి మండలంలో అత్యధికంగా సాగు చేస్తారు. ఖరీఫ్ సమీపిస్తుండడంతో రైతులు ఇప్పటికే ఎరువులు విత్తనాలు కొనుగోలు చేసుకుని దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచుతున్నారు. ఒక రైతు ఎకరాకు 120 కిలోల యూరియా 30 కిలోల చొప్పున మూడు లేదా నాలుగు సార్లు వాడాల్సి ఉంది. కానీ అధిక దిగుబడుల కోసం యూరియాను అధికంగా వినియోగిస్తున్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. డీఏపీ ఎకరాకు అడుగు మందు ఒక సంచి వాడాలి ఫొటోస్ 30 కిలోలు లో 15 కిలోలు అడుగు వేయాలి. మరో 15 కిలోలు వరి నాటు వేసిన తరువాత వేయాలి. దీని ద్వారా రోగాలు రావు. అదేవిధంగా 20- 20-15 యూరియాకు వాడరాదు. రైతులు మాత్రం వాడుతున్నారు. కేవలం మొక్కజొన్న సోయా వేరుశెనగ పల్లి పంటలకే వాడాలి. దీనివలన ఈ పంటలకు లాభాదాయకం. కానీ రైతులు మాత్రం తెగులు సోకినప్పుడు మందులు పిచికారి చేయడంతో రసాయన ఎరువులు అధికంగా వాడుతున్నారు. రైతులకు దిగుబడి రాక దిగులు చెందుతున్నారు. అయితే మట్టి పరీక్షలు నిర్వహించినట్టయితే.. నేల స్వభావం తెలిసి దానికి అనుగుణంగా పంటల సాగుతో పాటు భూసారం పెరిగేలా పోషకాలు పెరిగేలా సూచనలు ఇచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పటి వరకు మట్టి పరీక్షలు చేపట్టకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

ఎలాంటి ఆదేశాల రాలేవు

మట్టి పరీక్షలు చేయించాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవు. రైతులు ముందుకు వస్తే మట్టి పరీక్షలు చేయడానికి వ్యవసాయ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే గ్రామాలలో రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలపై అవగాహన కల్పిస్తున్నాం.

భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

మూలనపడ్డ పరికరాలు..

గతంలో గత మూడు సంవత్సరాల క్రితం వ్యవసాయ అధికారులు రైతుల పంట పొలాలకు వెళ్లి భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరించే వారు. ప్రస్తుతం పరికరాలు రైతువేదికల్లో మూలన పడ్డాయి. కొన్ని పరికరాలు తుప్పు పట్టి పని చేయ కుండా పోయినాయి. మట్టి పరీక్షలు గతంలో పంట పొలంలో తీసిన శాంపిల్ బోధన్ నిజామాబాద్ పరిశోధన కేంద్రాలకు పంపించే వారు. మట్టి పరీక్షల ఫలితాలు సకాలంలో రాకపోవడం వల్ల ఆలస్యం కావడంతో రైతులు ముందుకు రావడం లేదు జిల్లాలో ఇప్పటివరకు రైతులు ముందుకు రాకపోవ డంతో మట్టి పరీక్షలు కనుమరుగైతున్నాయి. వేలాది రూపాయలు పెట్టి భూసార పరీక్షలకు సంబంధించి నటువంటి పరికరాలను గతంలో వినియోగించారు. ప్రస్తుతం పరికరాలు రైతు వేదికల్లో మూలన పడి తుప్పు పడుతున్నాయి.

ఎవరి ధీమా వారిదే..

- దగ్గరపడుతున్న లోక్‌సభ కౌంటింగ్



నవతెలంగాణ-మద్నూర్

పార్లమెంట్ ఎన్నికలు ఏడు విడతలుగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తూ వస్తుంది. ఇప్పటివరకు ఆరు విడతలు పూర్తయ్యాయి. చివరిగా ఏడవ విడత జూన్ 1న జరగనున్నాయి. దీంతో దేశ వ్యాప్తంగా పోలింగ్ ముగియనుంది. తదనంతరం 4వ తేదీనా ఫలితాలు విడు దల కానున్నాయి. రాష్ట్రంలో నాలుగో విడతలో ఒకేసారి పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. ఇక కౌంటింగ్ కోసం ఆయా పార్టీల నాయకులు రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారు.

కౌంటింగ్ తేదీ దగ్గర పడుతున్నా కొద్దీ నాయకుల్లో ఉత్కంఠ మొదలైంది. జూన్ 4న కౌంటింగ్ జరగనున్నందున జహీరాబాద్ పార్లమెంటు స్థానానికి జరిగిన ఎన్నికల్లో గెలుపు ఓటమిలపై బిజెపి కాంగ్రెస్ నాయకుల్లో ఉత్కంఠ నెలకొంటూనే స్వల్ప మెజార్టీతోనైనా మేమంటే మేమే గెలుస్తామంటూ ధీమా వ్యక్తం చేసుకుంటున్నారు. జహీరాబాద్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో ప్రజల నాడి నిశ్శబ్దంగా కనిపిస్తోంది. కాంగ్రెస్, బీజేపీ మధ్య ప్రధానంగా పోరు నడిచిందని, ఎవరు గెలుస్తారనేది ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి నెలకొన్నట్టు స్థానిక విశ్లేషకులు భావిస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా కొందరు బిజెపి గెలుస్తుందని, మరికొందరు కాంగ్రెస్ గెలుస్తుంది అంటూ చెబుతున్నారు. ఈ విధంగా ఏ పార్టీకి భారీ మెజార్టీ రాకపోయినా స్వల్ప మెజార్టీతోనైనా గెలిచి తీరుతామని కాంగ్రెస్ బిజెపి పార్టీ నాయకులలో ధీమా వ్యక్తం చేసుకుంటున్నారు. ఈసారి జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా కేంద్రంలో బిజెపి పార్టీ అధికారంలో ఉండటం పార్లమెంట్ ఎన్నికలు ఇరుపార్టీల మధ్య హోరాహోరీగా సాగింది. ఎక్కడ చూసినా బహిరంగంగా కాంగ్రెస్ పార్టీ అత్యధికంగానే గెలుస్తుంది అనేది వాదన. కానీ ప్రజలు బయట చెప్పకపోయినప్పటికీ నరేంద్ర మోడీ పేరునా బిజెపికి ఓట్లు పడ్డట్లు అక్కడక్కడ వినబడే చర్చల ద్వారా తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ కౌంటింగ్ రోజులు దగ్గరపడ్డాయి. గెలుపు ఎవరిదో ఎవరిదీమా గెలుస్తుందో ప్రజలు ఏ పార్టీకి మొగ్గు చూపారో జూన్ 4వ తేదీనా తెలియనుంది.

రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు

- జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో జాతీయ, రాష్ట్ర, గ్రామీణ రహదారులతో పాటు మునిసిపల్ ప్రాంతాలలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించిన ప్రాంతాలలో వేగనిరోదానికి స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ , స్టడ్స్, బ్లింకర్ లైట్లు, కల్వర్టుల వద్ద, అండర్ పాస్ ల వద్ద రేడియం స్టిక్కర్లు, టిఎండ్ గల రోడ్ ప్రాంతాలలో సైన్ బోర్డులు, హైమాక్స్ లైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఎస్పీ సింధు శర్మ, ట్రైనీ ఏఎస్పీ కాజల్ లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నా వ్యవస్థను నిందిస్తున్నారని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా పాటించి ప్రమాదాలు తగ్గేలా చూడాలన్నారు.

ప్రధానంగా జంక్షన్లు, యుటర్న్ లు, పాదాచారులు రోడ్డు దాటేటప్పుడు, వేగంగా వెళ్లడం, రాంగ్ సైడ్ లో డ్రైవ్ చేయడం, చిన్న, పెద్ద రోడ్లు కలిసే ప్రాంతాలు, వెలుతురు సరిగా లేని ప్రాంతాలలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించామని అన్నారు. ఇట్టి ప్రమాదాల నివారణకుగాను రోడ్డు భద్రతా మార్గదర్శకాలకనుగుణంగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రాష్ట్ర రహదారుల ఇంజనీరింగ్ అధికారులు, మునిసిపాల అధికారులు, గ్రామా ప్రత్యేకాధికారులు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్యాచ్ వర్కులు ఎప్పటికప్పుడు చేపట్టాలని, రోడ్డు వెంట ముళ్ళ పొదలు, చెట్ల పొదలు తొలగిస్తూ మలుపుల వద్ద సూచిక బోర్డులు, బాణం గుర్తులు ఏర్పాటు చేయాలన్నారు. వన్యప్రాణులకు హాని కలగకుండా పోలీసు, అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రమాదం జరిగిన గంట సమయం గోల్డెన్ పీరియడ్ అని, తక్షణ వైద్య సహాయం అందేలా చూడాలని, వెంటిలేటర్‌తో అంబులెన్స్ సిద్ధంగా ఉండాలని, ఆసుపత్రిలో అత్యవసరమైన వైద్య పరికరాలు సిద్ధంగా ఉండాలని వైద్యాధికారులకు సూచించారు. అంబులెన్సు వచ్చే వరకు క్షతగాత్రునికి తగు ప్రథమ చికిత్స అందేలా పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది శిక్షణ పొంది ఉండాలన్నారు.

ప్రమాద బాధితులను కాపాడే నిమిత్తం అవసరమైన వస్తువుల కొనుగోలుకు, రక్తదానానికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రాధికార సంస్థ అధికారులు సి.ఎస్.రావు, భరత్, ఆర్ అండ్ బి ఈ ఈ రవి శంకర్, డిఎమ్ అండ్ హెచ్ ఓ చంద్రశేఖర్, ఆర్.టి.ఎ. శ్రీనివాస్ రెడ్డి, జిఎంఆర్ హైవేస్ లక్ష్మణ్ రావు, వెంకట రమణ, ఎంహెచ్ పీఎల్ అధికారులు ప్రభాకర్ రెడ్డి, ఖాజామొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గొంతునులిమేశాడు..

- చిన్నారిని హత్య చేసిన సవతి తండ్రి



నవతెలంగాణ-మాక్లూర్

అభం శుభం తెలియని పసి పాపను గొంతు నులిమి దారుణంగా హతమార్చాడో సవతి తండ్రి. ఈ హృదయవిధాకర దుర్ఘటన మండలంలోని ధర్మోరాలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ధర్మోరా గ్రామానికి చెందిన ఈర్నాల అరుణ్ ఏడాది క్రితం నిజామాబాద్‌కు చెందిన సునీతని రెండో వివాహం చేసుకున్నాడు. అయితే సునీతకు మొదటి భర్తతో జన్మించిన కూతురు లక్కీ(4) ఉంది. అరుణ్ వివాహ సమయంలో సునీతతో పాటు లక్కీని కూడా తీసుకొని వెళ్లాడు. ఈ క్రమంలో పాపని ఇంట్లో వద్దని అరుణ్ తరుచూ భార్యతో గొడవ పడేవాడు. అయితే 3 నెలల క్రితం పాప లక్కీని కొట్టి చెయ్యి విరిచాడు. అప్పటి నుంచి పాపని సునీత నిజామాబాద్‌లో ఉన్న తల్లీ దగ్గరికి పంపించేసింది. అయితే బుధవారం సునీత తన కూతురిని చూడాలని భర్త అరుణ్‌ను కోరింది. అందుకు అరుణ్ నిజామాబాద్ నుంచి పాపని తీసుకొని ధర్మోరకు వచ్చాడు. పాప లక్కీ నిద్రిస్తున్న సమయంలో తల్లీ సునీత స్నానానికి వెళ్లింది. ఈ క్రమంలో అరుణ్ నిద్రిస్తున్న కూతురిని గొంతు నులిమి హత్య చేశాడని తల్లీ వాపోయింది. సమాచా రం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టు మార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలంచారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తాం

- గత పాలకులు విస్మరించారు
- కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం
- ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పల్లెలను అభివృద్ధి చేయాలనే ఒక సంకల్పంతోటి మండలంలోని ప్రతి గ్రామ గ్రామానికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నట్టు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించినా గ్రామాలను మాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఏ గ్రామానికి వెళ్లినా స్థానిక సమస్యలను ఏకరువు పెడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం కాబట్టి ఆయా గ్రామాలలో ప్రజలు తీసుకొచ్చిన వారి సమస్యలను అధిష్టానంతో దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి చేస్తానని అన్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు సుడిగాలి పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా బేగంపూర్ అంజని, తలాబ్ తాండ, చావునితాండ, పోచారం, లింగంపల్లి గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటించగా ప్రజలు వారి గ్రామంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అంజనీ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తులు గ్రామంలో ఉన్న పాఠశాల స్థలాన్ని స్థానికులు కబ్జా చేస్తున్నారని పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఒక ఉపాధ్యాయురాలను వేరే పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారని అలాగే చెరువు నుండి కాలువ నిర్మిస్తే చెరువు కింద ఉన్న రైతులకు పంట పంటలు అధికంగా పండుతాయని కాలువ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరారు. తలాబ్ తాండ సమావేశంలో ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తాగునీటి సమస్య పోడు భూముల సమస్య గ్రామంలో కరెంటు పోల్స్ పాఠశాల శిథిలావస్థలో ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే నాగమడుగు ఇరిగేషన్ ద్వారా వడ్లం చెరువు నుండితలాబ్ తాండ గ్రామం వరకు పైప్ లైన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులు వారి వారి సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోచారం గ్రామానికి వెళ్లే బ్రిడ్జ్ కూలిపోయి చాలా రోజులు గడుస్తున్నా అప్పుడు ఉన్న ఎమ్మెల్యే పట్టించుకోలేదని, ఇప్పటివరకు బ్రిడ్జి పనులు చేపట్టకపోవడం.. వాళ్లు అభివృద్ధి చేయలేరు అనేదానికి నిదర్శనమని అన్నారు. త్వరలోనే పోచారం గ్రామానికి బ్రిడ్జి నిర్మిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. బేగంపూర్ గ్రామంలో గోపాల్ ఆధ్వర్యంలో బి ఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి మాజీ సర్పంచులు నాగిరెడ్డి, గణపతి మధన్, పార్టీ నాయకులు పండరి, మోహన్, గోపాల్, జైపాల్, సంజీవ్, బస్వరాజ్ దేశాయ్,నాందేవ్,అంజా గౌడ్,సాయి గౌడ్, రషీద్,ఫెరోజ్, ఆయా గ్రామ పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూళ్ల పున:ప్రారంభానికి ముందే

పనులన్నీ పూర్తి కావాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ఆయా పాఠశాలల్లో కొనసాగుతున్న పనుల తనిఖీ



పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే నాటికే ప్రభుత్వ స్కూళ్లల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులన్నీ పూర్తి చేయించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను కలెక్టర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిచ్‌పల్లి మండలం అమృతాపూర్ క్యాంప్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతో పాటు, జక్రాన్‌పల్లి మండలం అర్గుల్, లక్ష్మాపూర్ గ్రామాల్లోని ప్రైమరీ స్కూళ్లను, మునిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించి పనులను నిశితంగా పరిశీలించారు. కిచెన్ షెడ్లు, టాయిలెట్స్, ఫ్లోరింగ్, తరగతి గదులు, పైకప్పు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, నీటి సంపు, వాటర్ ట్యాంక్ తదితర వాటిని పరిశీలించారు. మంజూరైన వాటిలో ఇప్పటివరకు ఎన్ని పనులను పూర్తి చేశారు, ఎన్ని నిధులు వెచ్చించారు, ఇంకా ఎన్ని పనులు పూర్తి కావాల్సి ఉంది తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ దశలలో కొనసాగుతున్న పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి వీలైనంత త్వరగా పూర్తి చేయించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మరో వారం, పది రోజులలోపు ఏ ఒక్క పని పెండింగ్ లేకుండా పూర్తి చేయించాలని అన్నారు. పాఠశాలల ఆవరణలో మురుగు జలాలు, వర్షపు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యతతో పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని, ఎక్కడ కూడా రాజీ పడవద్దని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. విద్యార్థుల ప్రయోజనాలతో ముడిపడిన పనులు అయినందున నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హితవు పలికారు. పెచ్చులు ఊడిన పైకప్పుకు కెమికల్ ట్రీట్మెంట్ చేసిన మీదట పూర్తి స్థాయిలో మరమ్మతులు జరిపించాలని, లీకేజీలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతి బడిలో విద్యార్థిని, విద్యార్థులకు రక్షిత మంచి నీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. బడుల పున్ణ ప్రంరభానికి ముందే జిల్లా వ్యాప్తంగా గల అన్ని ప్రభుత్వ పాఠశాలలను గ్రామ పంచాయతీ కార్మికుల సహాయంతో శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, డీఈఓ దుర్గాప్రసాద్, మండల ప్రత్యేక అధికారి యోహాన్, పంచాయతీరాజ్ ఈ.ఈ శంకర్ తదితరులు ఉన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్ రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

2025 గణతంత్ర దినోత్సవం సందర్భంగా సామాజిక, సేవా రంగం, సాహిత్య రంగం, క్రీడా రంగంలో విశిష్ట సేవలందించిన అభ్యర్థుల నుండి పద్మ అవార్డుల కోసం ప్రభుత్వానికి సిఫారసు చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 800 పదాలకు మించకుండా తాము చేసిన కార్యక్రమాల గురించి వివరిస్తూ అవసరమైన డాక్యుమెంట్లను (వర్డ్ అండ్ పిడిఎఫ్) లో 4 జతల హార్డ్ కాపీలతో పాటు ఫార్మాట్ (సాఫ్ట్ కాపీ), నామినేషన్ ఫారాలను జూన్ 1 లోగా కలెక్టరేట్‌లోని రెండవ అంతస్తులో గల 223 గదిలోని జిల్లా యువజన క్రీడాధికారి కార్యాలయంలో సమర్పించవలసినదిగా ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు http://www.padmaawards.gov.in వెబ్ సైట్ నందు కానీ 9440292793 లేదా 9618126053 నెంబర్లకు సంప్రదించవలసినదిగా దామోదర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు.

గొర్రెలకు, మేకలకు ఉచిత వ్యాధి నిరోధక టీకాలు


టీకాలు అందజేస్తున్న పశు వైద్యాధికారులు

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి మండల కేంద్రంలో గొర్రెలు, మేకలకు గురువారం చిటుక వ్యాధినిరోధక టీకాలు అందజేశారు. ఈ సందర్భంగా పశు వైద్యులు సురేష్ కుమార్ మాట్లాడుతూ.. వానాకాలంలో వచ్చే వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు ఇచ్చినట్టు తెలిపారు. కోటగిరిలో 1300 జీవాలకు టీకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సుధీర్ గౌడ్, జీవాల పెంపకందారులు పాల్గొన్నారు.

విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న ముస్కు నర్సయ్య

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన ముస్కు నర్సయ్య అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం తనవంతుగా గురువారం ఉదయం రూ.51,000 వేలు ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు సభ్యులు విరాళం అందజేసిన ముస్కు నర్సయ్య దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా మరి కొంతమంది దాతలు ఆలయ అభివృద్ధి కోసం ముందుకు రావాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎర్రోళ్ల విజయ్, కంచు గంగాధర్, బొట్ల రాజన్న, గోపు రమేష్, బొట్ల భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ డెలివరీ చార్జీలు యాజమాన్యాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆయిల్ కంపెనీ నిబంధనల ప్రకారం గ్యాస్ సిలిండర్ డెలివరీ చార్జీలు గ్యాస్ యాజమాన్యాల చెల్లించాలని, ఇవ్వని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. నిజామాబాద్‌లోని వివిధ గ్యాస్ ఏజెన్సీల్లో ఇంటికి సిలిండర్లను డెలివరీ చేసే కార్మికుల సమస్యల కోసం చేస్తున్న నాలుగో రోజు సమ్మెలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కమార్, డీఎస్ఓ చంద్ర ప్రకాష్‌కు వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ.. జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న డెలివరీ కార్మికులకు ఆయిల్ కంపెనీలు ఇచ్చిన గైడ్లైన్స్ ప్రకారం సిలిండర్ డెలివరీ ఛార్జ్ చెల్లించకుండా యాజమాన్యం ప్రజల దగ్గర పైసలు వసూలు చేయాలని పురమాయిస్తూ బలవంతంగా వసూలు చేయిస్తున్నారని ఇది రూపుమాపాలని అన్నారు. ఆయిల్ కంపెనీలు ఒక సిలిండర్ డెలివరీ చేస్తే 33 రూపాయల 43 పైసలు డెలివరీ చార్జి చెల్లించాలని ఉన్నా యాజమాన్యం చెల్లించకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని అన్నారు. కార్మికులు డెలివరీ చేసే వాహనాలను వారే సమకూర్చుకోవాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించకుండా కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే వారిని విధుల నుండి తొలగిస్తున్నారని అన్నారు. ఈ విషయమై యజమానులకు కార్మిక శాఖ అధికారులకు గత ఫిబ్రవరి నుంచి వినతిపత్రాలు ఇచ్చినా.. స్పందించని పరిస్థితుల్లో నాలుగు రోజులుగా సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. స్పందించిన అదనపు కలెక్టర్ కార్మిక శాఖ అధికారుల ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిన్నెల హనుమాన్లు, కుకింగ్ గ్యాస్ ఏజెన్సీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సాయన్న, నాయకులు రవికుమార్, బబ్లు, రాజు, నయీమ్, గంగాధర్ వివిధ ఏజెన్సీల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమించిన స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోషమైన మహేష్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అడ్మిషన్స్ చేస్తున్న ప్రైవేటు, కార్పొరేటు స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అడ్మిషన్స్ చేస్తున్న ప్రైవేటు కార్పొరేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోషమైన మహేష్ మాట్లాడుతూ జీవో నంబర్ 42/2010 ప్రకారం ప్రైవేటు కార్పొరేటు పాఠశాలలో క్యాపిటేషన్ ఫీజులు గాని డొనేషన్ల పేరుతో గాని డబ్బులు వసూలు చేయవద్దని.. కానీ నిజామాబాద్ నగరంలో అనేక ప్రైవేటు కార్పొరేటు పాఠశాలలు అడ్మిషన్ ఫీజు అని, రిజిస్ట్రేషన్ ఫీజు అని పేర్లు మార్చి విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర్నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయన్నారు. విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. అదేవిధంగా నిజామాబాద్ నగర కేంద్రంలో ఉన్న ఎస్ఎఫ్ఎస్ లాంటి స్కూళ్లలో రెండో తరగతి విద్యార్థినికి 2500 వరకు రిజిస్ట్రేషన్ ఫీతో అని డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాగే నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో ధనార్జనే ధ్యేయంగా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన అనేక ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ అనుమతులు లేకుండా అడ్మిషన్ చేసుకోవడం, అడ్మిషన్స్ చేసుకోవడం కోసం సోషల్ మీడియాలో, ఇతర మాధ్యమాలలో ప్రచారం చేస్తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మరికొన్ని ప్రైవేటు పాఠశాలలో హైదరాబాద్ కేంద్రంగా ఉండే పాఠశాలల యాజమాన్యాలు తమ తమ పాఠశాల పేరుతో నిజామాబాద్ నగరంలో ఉన్న ఇతర పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులను మోసపూరిత మాటలతో నమ్మించి అడ్మిషన్లు చేస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర డబ్బులు వసూలు చేసుకునే పని పెట్టుకున్నాయని అన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తున్న ప్రైవేటు కార్పొరేటు పాఠశాలలో తనిఖీలు నిర్వహించి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర అధ్యక్షులు గణేష్, నగర కమిటీ సభ్యులు వేణు, నారుతి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌కు దారితీస్తున్న వ్యసనం

- నేడు పొగాకు వ్యతిరేక దినోత్సవం





నవతెలంగాణ-ఆర్మూర్

సరదా కోసం అలవాటు పడి మనం గుప్పుగుప్పుమని పీలుస్తున్న సిగరెట్లు ప్రాణాలను హరిస్తున్నాయి. మనం నమిలే గుట్కా, పాన్ జరదా, పాన్‌పరాక్, తంబాకు తదితర పొగాకు ఉత్పత్తుల వాడకం క్యాన్సర్‌కు దారితీస్తుంది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో గుట్కా అమ్మకాలను నిషేధిస్తూ జీవో జారీ చేసింది. కానీ ఆచరణలో మాత్రం గుట్టు చప్పుడు కాకుండా అమ్మకాలు కొనసాగుతూనే ఉన్నాయి. పొగాకు తాగడం నేడు ఒక ఫ్యాషన్‌గా మారింది. చిన్న పెద్ద తేడా లేకుండా అనేక రోగాల భారిన పడుతున్నారు. అనేక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. నేడు శుక్రవారం అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ ప్రత్యేక కథనం.

పెద్ద ఆటంకంగా..

10 మందిలో నిలబడి సిగరెట్ తాగే వారి కన్నా పక్క నుంచి పీల్చే వారికి ఎక్కువ జబ్బులు వచ్చే ప్రమాదం పొంచి ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జబ్బుల బారిన పడే వారిని పాసివ్ స్మోకర్ అంటారు. దీని అర్థం పొగ తాగేవారికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఆరోగ్యవంతమైన సమాజానికి పొగాకు వినియోగం పెద్ద ఆటంకంగా మారింది. పొగరాయుళ్ల వదిలే పొగ పర్యావరణానికి పెను ముప్పుగా మారింది.

విలువైన ప్రాణాలు పోతున్నా..

పొగాకును వివిధ రూపాల్లో వినియోగించటం రోజురోజుకు పెరిగిపోతుంది. అవి కలిగిస్తున్న దశ భావాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అలవాటు పొగాకు ఉత్పత్తుల వినియోగం నియంత్రణకు ప్రజల్లో చైతన్యం లేదు. కారణంగా పొగాకు వాడకం తగ్గడం లేదు. ఫలితంగా గుండె జబ్బులు, క్యాన్సర్లు, ఊపిరితిత్తుల వ్యాధులు, కిడ్నీ వైఫల్యం తదితర ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్నారు. తద్వారా విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. వ్యక్తులు నష్టపోవడం కాకుండా సామాజికంగా ఎన్నో కష్టాలు చోటు చేసుకుంటున్నాయి. పొగరాయుళ్ల గుప్పుగుప్పున వదిలే దాని ఉత్పత్తులతో సమాజానికి వాటిల్లుతున్న ప్రమాదంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక పలు హెచ్చరికలు చేసింది. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం మే 31వ తేదీన వరల్డ్ యాంటీ టొబాకో డేగా సంస్థ ప్రకటించింది. దీంతో 1987 నుంచి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంగా పాటిస్తున్నారు.. ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగానికి ప్రజలంతా దూరంగా ఉండాలని నిర్ణయించారు. పొగాకు ఉత్పత్తులతో జరుగుతున్న తీరును ప్రచారం చేయాలని అనుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం 20వ శతాబ్దంలో 100 మిలియన్ మరణాలు కేవలం పొగాకు ఉత్పత్తులతోనే జరుగుతున్నవి. తలనొప్పి, తల తిరగడం, నిద్రలేమి, నోరు, గొంతు, అల్సర్లు, పుండ్లు, పిచ్చి కలలు, కడుపులో మంట, జీర్ణాశయ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, మూత్రశయానికి సంబంధించిన సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. పొగాకులో ఉండే నికోటిన్ పొగ పీల్చిన ఐదు నిమిషాల్లోనే రక్తంలో కలిసిపోయి క్షణాల్లోనే మెదడుకు చేరుకుంటుంది. వెనువెంటనే మెదడులో దోపామైన్ అనే రసాయనిక పదార్థాలను విడుదల చేస్తుంది. ఈ ప్రక్రియ ద్వారా పొగతాగే వారిలో నమిలే వారిలో మత్తు అనుభూతి ఉంటుంది. తద్వారా అవి లేకుండా గడపలేని స్థితికి చేరుకుంటారు. పొగాకు పీల్చడం, నమలడంతో నికోటిన్‌తో పాటు నాలుగు వేల రకాల విషమ కారకాలు 43 రకాల క్యాన్సర్ కారకాలు శరీరంలో ప్రవేశిస్తాయి. గత కొద్ది సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై చట్టంలో కీలకమైన మార్పులు తీసుకువచ్చింది. బహిరంగ ప్రదేశాలలో పొగతాగడాన్ని పూర్తిగా నిషేధించింది. ఈ చట్టం ప్రకారం బహిరంగ ప్రదేశాలలో పొగాకు ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగంపై వ్యక్తులకు రూ.200 జరిమానా విధించవచ్చు. ఈ జరిమానా విధించే అధికారం పోలీసులు, ఆహార, డ్రగ్స్ కంట్రోల్ అధికారులకు ఇచ్చింది ప్రభుత్వం. ఈ చట్టం ప్రకారం బస్టాండ్లు, రైల్వేస్టేషన్లో, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, ప్రజలు గుమిగూడే ప్రదేశాలుంటే బహిరంగ ప్రదేశాలలో సిగరెట్ బీడీలు తాగిన అది నేరం కిందే లెక్క. 2008లో మరోసారి ఈ చట్టానికి సవరణలు జరిగాయి. బహిరంగ ప్రదేశాలు అంటే ఏమిటో స్పష్టమైన వివరాలు ఇవ్వడంతో పాటు దాదాపు మూడుసార్లు ఏ వ్యక్తి అయినా పట్టుబడితే సదరు వ్యక్తికి రూ.500 వరకు జరిమానా విధించవచ్చని పేర్కొన్నారు.

అమలులో చిత్తశుద్ధి ఎక్కడ..?

పొగాకు ఉత్పత్తిలో వినియోగం బహిరంగ ప్రదేశాల్లో నిషేధిస్తూ నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడంలో చిత్తశుద్ధి లోపించింది. చుట్టుపక్కల ఉన్నవాళ్ల అధికారులకు ఫిర్యాదు చేయడం లేదు. అధికారులు స్పెషల్ డ్రైవ్ సందర్భాల్లో పొగాకు తాగేవారికి జరిమానా విధిస్తారు. చట్ట ప్రకారం ఆయా ఆవరణలో పొగాకు వినియోగం జరుగుతున్నప్పటికీ ఆయా ఆవరణలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు వివిధ సంస్థల మేనేజర్లు, సూపర్వైజర్లు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అయితే ఎక్కడ అమలు కావడం లేదు.

అవగాహన కల్పించాలి



నేటి యువతకు స్వచ్ఛంద సేవ సంస్థలు పొగాకు వాడకంపై అవగాహన కార్యక్రమాలు కల్పించాలి. పొగాకు ఉత్పత్తులపై వాటి వాడకంతో ఎదురయ్యే పరిణామాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి.

- మాడవేడి పద్మావతి, ప్రధానోపాధ్యాయురాలు, గోవింద్‌పేట్.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



నేడు అనేకమంది పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడి తమ విలువైన ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఆరోగ్య నియమాలను పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ అమృతలత, రచయిత్రి, విజయ్ విద్యాసంస్థల అధినేత్రి, ఆర్మూర్.

నిర్మించారు.. వదిలేశారు


ఇరిగేషన్ కార్యాలయానికి తాళం


కార్యాలయ ఆవరణలో కల్లుసీసాలు, బాటిళ్లు

- నిరుపయోగంగా ఇరిగేషన్ కార్యాలయం
- 10 ఏండ్ల క్రితం నిర్మాణం పూర్తి
- అధికారులు ఉండని వైనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిన వైనం

నవతెలంగాణ-మాక్లూర్

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మండల కేంద్రంలో పలు కార్యాలయాలను నిర్మించింది. కానీ పలు కార్యాలయాలకు అధికారులు రాకపోవడంతో కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి.

మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయం నిర్మించి సుమారు పది సంవత్సరాలు గడుస్తుంది. అందులో కుర్చీలు, టేబుల్ ఉన్నప్పటికీ అధికారులు లేక ఎల్లప్పుడూ కార్యాలయానికి తాళం వేసి ఉంటోంది. అధికారులను కలువాలంటే చరవాణి ద్వారా సంప్రదించాల్సిన పరిస్థితి. కొన్ని సమయాల్లో చారవాణి పని చేయకపోయినా, అధికారులు స్పందించకపోయినా బాధితులు ఆందోళన చెందుతూ ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది.

రూ.16 లక్షలు వృథా..

గత ప్రభుత్వం ఇరిగేషన్ కార్యాలయ నిర్మాణానికి 2007 సంవత్సరంలో ప్రత్యేక నిధులు రూ.12 లక్షలు మంజూరు చేసింది. అవి సరిపోవడం లేదని మళ్లీ రూ.నాలుగు లక్షలు మంజూరు చేసింది. వీటితో కార్యాలయం నిర్మాణం పూర్తయింది. 2015 సంవత్సరంలో కార్యాలయాన్ని ప్రారంభించినా.. అధికారి మాత్రం రెండు, మూడు రోజులే అందులో విధులు నిర్వహించారు. అప్పటి నుంచి కార్యాలయానికి తాళం ఉంటోందని స్థానికులు చెపుతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డ..

ఇరిగేషన్ కార్యాలయం నిర్మించినప్పటి నుంచి అధికారులు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో మద్యం ప్రియులు మద్యం సేవిస్తున్నారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు సైతం కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇరిగేషన్ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి నిత్యం అధికారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, రైతులు కోరుతున్నారు.

విద్యుత్ సదుపాయం లేక ఆఫీస్ తీయడం లేదు

ఇరిగేషన్ భవనం నిర్మించినా.. అందులో విద్యుత్ సదుపాయం, వైరింగ్, ప్లంబింగ్ ఏర్పాటు చేయకపోవడంతో కార్యాలయంలో ఉండలేక పోతున్నాం. అప్పుడప్పుడు వచ్చి వెళుతున్నాం.

- ఇరిగేషన్ ఏఈ దివ్య భారతి

కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని 17 గ్రామపంచాయతీలో 3 నెలల నుంచి 8 నెలల వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నందున వెంటనే కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని గురువారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. 15 రోజుల్లో చెల్లించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మ మాట్లాడుతూ.. జూన్ 10వ తేదీ నుంచి దశలవారీగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ మండల కార్యదర్శి సిహెచ్ లక్ష్మణ్, రాజయ్య, కేలక్ష్మి లింగం, సాయమ్మ, సిహెచ్.గోపి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని చిన్నవాల్గొట్ గ్రామంలో విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఇఓ సతీష్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులు విత్తనాలను లైసెన్స్ ఉన్న డీలర్ వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని, విత్తనాలను కొనుగోలు చేసిన రసీదు, ఖాళీ సంచులను పంటకాలం ముగిసేవరకు రైతులు తమ వద్ద భద్రపరచుకోవాలి తెలిపారు.

కరెంటు కోతలతో సతమతం

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు


కరెంట్ లేక నీరు పారించలేకపోతున్న రైతులు

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండల శివారులో గల వివిధ ప్రాంతాలలో రైతులు కరెంటు కోతలకు నారుమడి కూడా సిద్ధం చేసుకోలేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వమేమో మాటల్లో ఎక్కడ కూడా కరెంట్ కోతలు లేవని చెప్తుంటే ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. దాదాపుగా రోజుకి 7 నుంచి 8 సార్లు కరెంటు పోతోంది. అసలు ఏ సమయానికి కరెంట్ వస్తుందో.. ఏ సమయానికి కరెంట్ పోతుందో రైతులకు అర్థం కావడం లేదు. వానాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో బోరు బావులు కలిగిన రైతులు నారుమడులను సిద్ధం చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే కరెంట్ సరైన సమయంలో రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి కోతలు లేకుండా నాణ్యమైన కరెంట్ అందించాలని రైతులు కోరుతున్నారు. కొందరు రైతులు జీలుగా విత్తనాలను కొనుగోలు చేశారు. ఆ విత్తనాలు తమ పంట పొలాలలో విత్తు కోవాల్సి ఉంది. కానీ కరెంటు సమయానికి రాకపోవడంతో వాటిని చల్లలేకపోతున్నారు. ఒక దిక్కున ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు నారు మడిలో నీరుని నింపాలంటే మూడు నుంచి నాలుగు రోజులు సమయం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భోజనశాలకు టేబుల్, కుర్చీలు వితరణ


దాతను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలోని దక్షిణ కాశి శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయంలో అన్న ప్రసాదశాలలో భక్తుల కొరకు పట్టణానికి చెందిన పురాం రాజమౌళి రాణి దంపతులు 6 టేబుల్, 24 కుర్చీలు వితరణ చేశారు. వితరణ చేసిన దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు నరసింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, సుదర్శన్, మైపాల్‌రెడ్డి, లింబాద్రి, మహేందర్‌రెడ్డి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని పకీర్ తెట్యా నుండి మెయిన్ రోడ్డు వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అడ్వకేట్ రామ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గం ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఫకీర్ తెట్యా నుండి మెయిన్ రోడ్ వరకు ఉపాధి హామీ నిధుల నుండి 25 లక్షల రూపాయల వ్యయముతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాంబిగే హన్మాండ్లు, టౌన్ అధ్యక్షులు చిప్ప శివ , సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ డాకూరి వెంకట్ రెడ్డి , ఏనుగండ్ల శ్రీనివాస్ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు మరగల దయానంద్ , మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

చేతులెత్తినా బస్సు ఆపట్లే

- రైతులకు సరిపడా విత్తనాలు
- సర్వసభ్య సమావేశంలో పలు అంశాల మీద చర్చ


హాజరైన సభ్యులు, అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-లింగంపేట్

గతంలో చేతులు ఎత్తిన చోట బస్సులు ఆపుతుండే వారని, కానీ ప్రస్తుతం బస్సులు ఆపడం లేదని ఏపీఓ అన్నపూర్ణ ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. బస్సులు ఆపకపోవడంతో వేసవి వేళ.. నడుచుకుంటూ వెళ్లేందుకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నట్టు వాపోయారు. లింగంపేట్ మండలం సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ గరిబున్నీస బేగం అధ్యక్షతన నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సర్వసభ్య సమావేశం ప్రజా ప్రతినిధులు అధికారులు సకాలంలో రాకపోవడం 11 గంటలకు ప్రారంభించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు చేపట్టిన పనులపై సమావేశంలో వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో జూన్ 13 వరకు అమ్మ ఆదర్శ పాఠశాలలో మరుగుదొడ్లు మూత్రశాలలో విద్యుత్తు తదితర పనులు పూర్తి చేయనున్నట్టు ఎంఈవో రామస్వామి తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచామని, రైతులు ఎరువుల విత్తనాలు కొనుగోలు సమయంలో తప్పకుండా రసీదు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ వివరించారు. పంచాయతీరాజ్ ద్వారా వివిధ రకాల పనులు చేపట్టామని, పోల్కంపేట్ సజ్జన్ పల్లి గ్రామాల మధ్యగల పెద్దవాళ్లపై బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా చేపడుతున్నట్టు పంచాయతీరాజ్ అధికారి రాకేష్ తెలిపారు. చేపల పెంపకంలో మహిళలు దృష్టిసారించినట్టయితే బ్యాంకు నుండి రుణాలను ఇస్తామన్నారు. ఇప్పటికే లింగంపేట్ మండలంలో ఆరు చేపల యూనిట్లు కొనసాగిస్తున్నట్టు ఏపీఎం శ్రీనివాస్ వివరించారు. లక్షల రూపాయలు పెట్టి బస్టాండ్ నిర్మాణం మరమ్మతులు చేపట్టినా బస్టాండ్‌ను శుభ్రంగా ఉంచడం లేదని సభ్యులు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎల్లారెడ్డి- కామారెడ్డి రోజువారీగా వెళ్లే బస్సులు సమయ వేళలు పాటించడం లేదని, మరుగుదొడ్లు వృథాగా మారాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ విటల్ రెడ్డి, సూపరింటెండెంట్ పవన్, ఎంపీఓ అబ్బ గౌడ్, ఎంపీటీసీలు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన ఎంపిడిఓ


పనులు పరిశీలించి సూచనలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కల్వరాల్ గ్రామంలో గురువారం ఎం.పి.డి.ఓ సంతోష్ కుమార్ అమ్మ ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. స్కూళ్లు పునః ప్రారంభించేలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు సంతోష్, కార్యదర్శి సందీప్ ఉన్నారు.

మహా అన్నదాన సేవలు రథోత్సవానికి గుర్తింపు

- ఆలయ కమిటీ చైర్మన్ సందుర్ వార్ హనుమాన్లు


బీబీపాటిల్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనారాయణ రథోత్సవానికి మహా అన్నదాతగా నిలిచిన ఎంపీ బీబీ పాటిల్ సేవలు రథోత్సవానికి ఎంతగానో గుర్తింపు తెచ్చాయని ఆలయ కమిటీ తాత్కాలిక చైర్మన్ సందూర్ వార్ హనుమాన్లు అన్నారు. గురువారం మహా అన్నదాత అయిన ఎంపీ బీబీ పాటిల్‌కు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎంపీ బీబీ పాటిల్‌తో మాట్లాడుతూ.. మీ మహా అన్నదానం రథోత్సవాలకు ఎంతో గుర్తింపుని ఇచ్చాయని గుర్తు చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కంచిన్వార్ రవి, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు తెప్పవార్ తుకారం, సీనియర్ నాయకులు కృష్ణ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్ల చెరువును అలుగు మరమ్మతు పనులు చేపట్టాలి


చెరువును పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని గుండ్ల చెరువును ఇరిగేషన్ ఈఈ పోచమల్లు, జడ్పీటిసి తిరుమల్ గౌడ్ గురువారం పరిశీలించారు. చెరువు అలుగులు చెడిపోయినందున మరమ్మతుల చేపట్టాలని గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం ప్రతినిధులు ఇరిగేషన్ ఈఈ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఇరిగేషన్ ఈ ఈ పోచమల్లు, డి ఈ అర్చన చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్య సహకార సంఘం సభ్యులు శిథిలావస్థలో ఉన్న అలుగులను చూపించారు. అలుగులు చెడిపోవడం వలన పెరిగిన చేపలు చెరువు నీటి ప్రవాహానికి కొట్టుకపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గుండ్ల చెరువుతోపాటు మండలంలోని ఇతర చెరువులు, కుంటలను పరిశీలించి అవసరమైన మరమ్మతులను వర్షాకాలంలో గా పూర్తి చేయాలని జెడ్పిటిసి తిరుమల్ గౌడ్ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. చెరువులకు అవసరమైన మరమత్తులను సత్వరమే చేపడతామని ఈ ఈ పోచమల్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏ ఈ బాలకృష్ణ, మత్స్య సహకార సంఘం సభ్యులు ఆబ్రబోయిన రాజు, , అబ్రబోయిన రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరైతుకూ విత్తనాలు అందజేస్తాం

- జీలుగ విత్తనాల పంపిణీలో అధికారులు
- విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచన


కామారెడ్డిలో విత్తనాలు అందజేత


మద్నూర్‌లో రైతులకు సూచనలిస్తున్న అధికారి సతీష్

నవతెలంగాణ-కామారెడ్డి/మద్నూర్

కామారెడ్డి మండలంలో పచ్చిరొట్ట పంట అయినా జీలుగ విత్తనాలు పంపిణీ చేపట్టినట్టు కామారెడ్డి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) కే.అపర్ణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో గల నాలుగు రైతు వేదికల్లో చిన్నమల్లారెడ్డి, ఇస్రోజివాడి, శబ్దిపూర్, క్యాసంపల్లిలలో గల రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు పర్మిట్స్ అందజేస్తున్నట్టు తెలిపారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రతి గ్రామ పరిధిలో ప్రతి రైతుకు విత్తనాలు అందే విధంగా చూస్తామని తెలిపారు. మండలంలో గల రెండు (గర్గుల్, చిన్నమల్లారెడ్డి) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా జీలుగ విత్తనాలు రైతులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రైతులకు ప్రతి క్లస్టర్లు పచ్చిరొట్ట పంటల ఉపయోగం, సాగులో పాటించాల్సిన మేళకువల గురించి రైతులకు క్లుప్తంగా వ్యవసాయ విస్తరణ అధికారులు వివరించారు.

కార్యక్రమంలో ఏడిఏ కామారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చిన్న మల్లారెడ్డి పరిధిలో 434 బ్యాగులు వచ్చాయన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గర్గుల్ పరిధిలో 400బ్యాగులు వచ్చాయి. వీటిల్లో 438 మంది రైతులకు 572 బ్యాగులు జీలుగు విత్తనం పంపిణీ చేసినట్టు తెలిపారు. విత్తనాల పంపిణీ రైతులకు ప్రశాంత వాతావరణంలో జరిగిందని ఏ రైతు కూడా ఇబ్బందికి గురి కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసరావు, చిన్నవల్లారెడ్డి క్లస్టర్ ఏఈఓ అశోక్ రెడ్డి, ఇస్రోజివాడి క్లస్టర్ ఏఈఓ రాణి, శబ్దిపూర్ క్లస్టర్ ఏఈఓ బాలకిషన్, క్యాసం పల్లి (కామారెడ్డి)క్లస్టర్ ఏఈఓ తేజస్విని, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు కొనేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

మద్నూర్ :

మండలంలోని పెద్ద తడగూర్‌లో వ్యవసాయ రైతులకు విత్తనాలు, ఎరువులు కొనేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వ్యవసాయ విస్తీర్ణ అధికారి సతీష్ రైతులకు గురువారం అవగాహన కల్పించారు. రైతులు లూజుగా వున్న విత్తనాలు కొనకూడదని, విత్తనాలు, ఎరువులు వ్యవసాయ శాఖ అధికృత డీలర్ల వద్ద మాత్రమే కొనాలన్నారు. విత్తనాలు తీసుకున్నపుడు రసీదు తప్పకుండా తీసుకొని దానిని పంటకాలం అయ్యేవరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసే ముందు బ్యాగ్ పైన వున్న లాట్ నెంబర్, ఎక్స్‌పెయిరీడేట్, లేబుల్ గమనించాలని, ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తే వ్యవసాయ శాఖ అధికారికి గానీ, వ్యవసాయ విస్తరణ అధికారికి గానీ సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా వచ్చే వానాకాలంలో సాగు చేసే పంటల గూర్చి వివరించడం జరిగింది. కార్యక్రమానికి రైతు సంగ్రామ్, యాదవ్‌రావు, హన్మండ్లు, మష్టాజి, నన్నేష, సకారం తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపంజరం లభ్యం



నవతెలంగాణ-నిజాంసాగర్

మహమ్మద్ నగర్ మండలంలోని సింగీతం అటవీ ప్రాంతంలో గురువారం అస్థిపంజరం లభ్యం అయినట్టు బాన్సువాడ సీఐ కృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్తిపంజరానికి ఉన్న ఆధారాలను పరిశీలించగా తుంకిపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి రవీందర్ (37)గా గుర్తించినట్టు పేర్కొన్నారు. గత 15 రోజుల క్రితం మృతి చెంది పూర్తిగా ఆస్తిపంజరంగా శవం ఉన్నట్టు ఆయిన తెలిపారు. ఆస్తిపంజరం వద్ద మద్యం బాటిల్లు, విషం బాటిల్ లభ్యమైందని ఆయన పేర్కొన్నారు. మృతుని భార్య వదిలిపోయిందని, రెండు సంవత్సరాల ఒక కూతురు ఉన్నట్టు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

కార్మిక శాఖకు ఒకశాతం సెస్

భవన ఇతర నిర్మాణ వ్యయాల్లో నుంచి చెల్లించాలి

కలెక్టర్ జితేశ్ వి పాటిల్


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా భవన , ఇతర నిర్మాణ వ్యయంలో ఒక శాతం సెస్ కార్మిక శాఖకు చెల్లించవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో భవన , ఇతర నిర్మాణ కార్మికుల చట్టం అమలుపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అధికారుల సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ ఏజెన్సీ ల ద్వారా నిర్మించే భవన, ఇతర నిర్మాణ వ్యయంలో ఒక శాతం సెస్ వసూలు చేసి కార్మిక శాఖకు చెల్లించవలసి ఉంటుందన్నారు. కాంట్రాక్ట్ లేబర్ ఆక్ట్ అండ్అంతరాష్ట్ర కార్మిక చట్టం ప్రకారం పనులు నిర్వయించే అధికారులు ప్రిన్సిపాల్ ఎంప్లాయర్ గా వ్యవహరిస్తారని, వారు తప్పనిసరిగా కార్మిక శాఖలో పేరు నమోదు చేసుకొని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని అన్నారు. జిల్లాలో మునిసిపల్ కమీషనర్లు, పంచాయతి రాజ్ శాఖ అధికారులు ప్రైవేట్ భవన, ఇతర నిర్మాణాలకు అనుమతులు ఇచ్చునప్పుడు నిర్మాణ ఖర్చులో తప్పనిసరిగా ఒక శాతం సెస్ వసూలు చేసి కార్మిక శాఖకు డిపాజిట్ చేయాలని కలెక్టర్ చెప్పారు. ఇట్టి సెస్ డబ్బులు కార్మిక సంక్షేమం కోసం ఉపయోగపడుతుందన్నారు. కాగా భవన , ఇతర నిర్మాణ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు కార్మిక శాఖ నుండి గుర్తింపు కార్డు తీసుకుంటేనే ఇది వర్తిస్తుందన్నారు.

ఈ సమావేశంలో సహాయా కార్మిక కమీషనర్ కోటేశ్వర్లు, పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు రఘునాథ్ రావు, సిపిఒ రాజారామ్, ఆర్ అండ్ బి ఈ ఈ రవిశంకర్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు నియామక ర్యాలీ

- మ్యూజిషియన్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం : కలెక్టర్ రాజీవ్‌గాంధీ


ఎయిర్‌ఫోర్స్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారత వాయు సేన (ఇండియన్ ఎయిర్ ఫోర్స్)లో అగ్నివీర్ వాయు (మ్యూజీషియన్) పోస్టుల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. అర్హులైన యువతీ, యువకులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భారత వాయుసేనకు చెందిన వింగ్ కమాండర్ గురుప్రీత్ అత్వాల్, నాన్ కమిషన్డ్ ఆఫీసర్ సందీప్ గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో జిల్లా పాలనాధికారిని కలిసి అగ్నివీర్ వాయు నియామక ర్యాలీ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అగ్నివీర్ వాయు (మ్యూజీషియన్) పోస్టుల భర్తీ కోసం భారత వాయు సేన వచ్చే జూలై నెలలో నియామక ర్యాలీ నిర్వహించనుందని తెలిపారు. కాన్పూర్, బెంగుళూరు నగరాలలో ఈ రిక్రూట్మెంట్ ర్యాలీ జరుగుతుందని వివరించారు. పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండి, 2004 జనవరి 02 నుంచి 2007 జూలై 02 తేదీ మధ్యన జన్మించిన అవివాహిత స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని సూచించారు. ప్రత్యేకంగా మ్యూజీషియన్ పోస్టులను భర్తీ చేయనున్నందున పియానో, గిటార్, వయోలిన్, శాక్సోఫోన్, తబలా వంటి సంగీత, వాద్య పరికరాలలో ఏదైనా ఒకదానిలో ప్రావీణ్యం కలిగి ఉన్న సంగీతకారులు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారు జూన్ 5 లోపు https://agnipath-vayu.cdac.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి భారత వాయుసేన నుంచి ఆన్‌లైన్లో తాత్కాలిక అడ్మిట్‌కార్డు జారీ చేయబడుతుందని తెలిపారు. రిక్రూట్మెంట్ ర్యాలీకి సంబంధించిన తేదీ, సమయం, వేదిక తదితర వివరాలను అడ్మిట్‌కార్డులో పొందుపరుస్తారని అన్నారు. అడ్మిట్‌కార్డు కలిగిన వారిని మాత్రమే రిక్రూట్మెంట్ ర్యాలీకి అనుమతిస్తారని తెలిపారు. జిల్లాకు చెందిన అర్హులైన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాయుసేన అధికారులతో భేటీ అయిన వారిలో కలెక్టర్, జెడ్పి సీఈఓ ఉష, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ముత్తెన్న, తదితరులు ఉన్నారు.

బైక్‌ల సైలెన్సర్‌లు మార్చితే క్రిమినల్ కేసులు




అధిక శబ్దం వచ్చేలా ఏర్పాటు చేసుకున్న బైక్ సైలెన్సర్‌లను స్వాధీనం చేసుకొని రోడ్డు రోలర్‌తో ధ్వంసం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ద్విచక్ర వాహనాదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను ఎలాంటి మార్పు చేసినా వాహనాదారుడితో పాటు మార్పు చేసిన మెకానిక్ పై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ ట్రాఫిక్ ఎ.సి.పి. టి.నారాయణ హెచ్చరించారు. గురువారం నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ ఆదేశాను సారంగా ఎన్.టి.ఆర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల కంపెనీ సైలెన్సర్ స్థానంలో ఎక్కువ సౌండ్ చేసే వాటిని బిగించి నడుపుతున్న బైక్‌లపై ఉక్కుపాదం మోపారు. నగరంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టగా.. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు ఏర్పటు చేసిన ద్విచక్రవాహనాలను గుర్తించి వాటి నుండి మార్పుచేసిన సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ట్రాఫిక్ పోలీసులు తొలగించిన సైలెన్సర్లను మరోమారు వినియోగించకుండా రోడ్ రోలర్ సాహయంతో 122కు పైగా సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు ధ్వంసం చేశారు.

అనంతరం ట్రాఫిక్ ఎ.సి.పి. మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రవాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరిత్యా నేరమని, శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం నియంత్రణతో పాటు ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపడుతున్నట్టు తెలిపారు.కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని, ఎవరైన వాహనాదారుడు సైలెన్సర్స్ మార్పు చేసే వారిపై పోలీసులు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అన్నారు.

జిల్లా రవాణా శాఖ అధికారి జె. ఉమా మహేశ్వర రావు మాట్లాడుతూ సైలెన్సర్లను మార్పు చేసి అధిక శబ్దంతో వాహనాలు నడపడం వలన హస్పటల్స్ యందు రోగులు ఇబ్బంది పడే అవకాశం ఉందని కావున ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యాక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎఎస్‌పి శేషాద్రిని రెడ్డి, ఐ.పి.యస్, ట్రెయినీ ఐ.పి.యస్., బి. చైతన్య రెడ్డి, ట్రాఫిక్ సి.ఐ వి. వెంకట్ నారాయణ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ బస్‌పాస్‌లు పంపిణీ



రాయితీ బస్‌పాస్‌లను అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అన్ని గ్రామాల దివ్యాంగులకు రాయితీపై బస్‌పాస్‌లు అందజేసినట్టు దివ్యాంగుల సిసి శ్రీరామ్ గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని శుభోదయం పాఠశాలలో 192 మందికి బస్సు పాసులను దివ్యాంగుల పునరావాస కేంద్రంలో పంపిణీ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసి ప్రతినిధులు శ్రీనివాస్, ఐకెపి మండల దివ్యాంగుల సమన్వయకర్త శ్రీరామ్ భుక్య, సిఆర్పి పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-నందిపేట్

ఉమ్మడి నందిపేట్ మండలంలో ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జి ప్రొద్దుటూరు వినయ్‌రెడ్డి గురువారం పర్యటించారు. ముందుగా పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. అనంతరం మండలానికి చెందిన పండారి ఇటీవల మరణించాడు. దీంతో విషయం తెలుసుకున్న వినయ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నందిపేట్, డొంకేశ్వర్ మండలాల పార్టీ నాయకులు ఉన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న యువకులు

నవతెలంగాణ-ఆర్మూర్

సాయి టెక్నికల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణలో భాగంగా గల్ఫ్ వెళ్లే వారికి ఏసి మెకానిక్, ఎలక్ట్రీషియన్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఏసీ రిఫ్రిజిరేటర్‌ల గురించి, మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కీర్తి ఐస్ ఫ్యాక్టరీలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జక్కుల రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ.. సాయి టెక్నికల్ ఇనిస్టిట్యూట్‌లో గల్ఫ్ వెళ్లే వారికీ, నిరుద్యోగులకు చాలా బాగా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. శిక్షణ అనంతరం హైదరాబాద్‌లో ప్రముఖ కంపెనీలలో ప్లేస్మెంట్ కల్పిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఇనిస్ట్రూటర్ కేశవకుమార్, చుక్కల రమణయ్య, విద్యార్థులు నిఖిల్, సాయికుమార్, సాయికరణ్ తేజ్, లోకేషర్ గౌడ్, సాయితేజ, యశ్వంత్, చరణ్, ఎస్‌డి యూనిస్ బృందం తదితరులు పాల్గొన్నారు.

పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలి

- మండల ప్రత్యేక అధికారి



పనులను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని మండల ప్రత్యేక అధికారి వాజిద్ హుస్సేన్, ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని దూపల్లి, దండిగుట్ట, కూనేపల్లి, బాగేపల్లి గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు విద్యుత్, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణాలు, అత్యవసర పనులపై సమీక్షించారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలోపే ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఉన్నట్లయితే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గౌస్ ఉద్దీన్, మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, పంచాయతీరాజ్ ఏఈ వినయ్ కుమార్, గ్రామ కార్యదర్శులు సిహెచ్.సాయిలు, గౌతమి, శివకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోకిల నాగరాజుకు సత్కారం



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్రస్థాయి బాల సాహిత్య సమ్మేళనానికి సమన్వయకర్తగా వ్యవహరించి తన వ్యాఖ్యానంతో, చలోక్తులతో అలరించిన నాగరాజుకు తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నప్ప గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లలితకళా పరిచయం చేసిన వివిధ రంగాల్లో ప్రఖ్యాతి సాధించిన కళాకారులు లలిత కళలు విద్యార్థులకు మనో విజ్ఞాన, వికాసాలను అందిస్తాయని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా బాల సాహిత్య పరిషత్ అధ్యక్షులు కాసర్ల నరేష్, కార్యదర్శి ప్రవీణ్ శర్మ, చింతల శ్రీనివాస్, శారద, హన్మాండ్లు, నాగరాజును అభినందించారు.

ఇందూర్ హైస్కూల్‌కు ఇంటర్నేషనల్ బ్రిలియన్స్ అవార్డ్

- 'బెస్ట్ స్కూల్ ఆఫ్ ది ఇయర్-2024'గా ఇందూర్ హైస్కూక్



నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల ఇందూర్ హైస్కూల్‌కు ఇంటర్నేషనల్ బ్రిలియన్సీ అవార్డు-2024 (బెస్ట్ స్కూల్ ఆఫ్ ది ఇయర్) వచ్చిందని ఇందూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కొడాలి కిశోర్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇందూర్ హైస్కూల్ గత 15సంవత్సరాలుగా బెస్ట్ ఎవలబుల్ స్కూల్‌గా ప్రభుత్వంతో భాగస్వామై విద్యాబోధన అందించిందని తెలిపారు. పాఠశాలలో ఎన్‌సీసీ, స్కౌట్, అటల్ టింకరింగ్ ల్యాబ్ కలిగి అధునాతన సౌకర్యాలున్నాయని అన్నారు. ఎన్‌సీసీ విభాగంలో నేషనల్ పరేడ్‌కు రెండు పర్యాయాలు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే సైన్స్‌ఫెయిర్‌లో జాతీయస్థాయి బహుమతులను పొందినట్లు తెలిపారు. పాఠశాల నిర్వహణలు మేనేజ్‌మెంట్, ఉపాధ్యాయుల అంకితభావం, పాఠశాల క్రీడా మైదానం, వినూత్న పద్ధతుల్లో విద్యార్థులకు విద్యాబోధన అంశాలను పరిగణలోకి తీసుకొని న్యూఢిల్లీకి చెందిన హైస్లెడ్జి మీడియా గ్రూప్ వారు 2024 ఏప్రిల్ 20న ఇందూర్ హైస్కూల్‌ను ఐబీఏ (ఇంటర్నేషనల్ బ్రిలియన్స్ అవార్డు -2024) కు ఎంపిక చేసిందని పేర్కొన్నారు. ఈ అవార్డును పోస్ట్ ద్వారా సోమవారం పంపించినట్లు తెలిపారు. తమ పాఠశాలకు అంతర్జాతీయ స్థాయి అవార్డు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని, దీనికి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల్లో
మౌలిక సదుపాయాలు కల్పించాలి

- జడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్‌రావు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పాఠశాలల పున్ణప్రారంభానికి ముందే వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించుటకు చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు అన్నారు. ఆర్థిక, ప్రణాళిక, పనుల కమిటీ సమావేశం జెడ్పి చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు అధ్యక్షతన, అలాగే స్థాయి సంఘం సాంఘీక సంక్షేమం సమావేశం కమిటీ చైర్‌పర్సన్ దాసరి ఇందిరా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ మాట్లాడుతూ.. సంబంధిత అధికారులు పాఠశాలల పున్ణప్రారంభానికి ముందే వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వసతి గృహాల ఆవరణలో విధిగా పరిశుభ్రతను పాటించాలని, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని మెనూ ప్రకారం అందించాలని, ఎక్కడైనా.. విద్యార్థులకు ఇబ్బందులు కలిగించినా సంబంధిత అధికారులు బాధ్యులు అవుతారని సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. పరిషత్ సాధారణ నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం, 15వ ఆర్థిక సంఘం ద్వారా 2020-21 నుంచి 2023-24 వరకు మంజూరైన పనులు త్వరగా పూర్తిచేయించాలని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులకు ఆదేశించారు. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో మంజూరైన పాత పనులు త్వరగా పూర్తిచేయాలని, అవసరమైన చోట రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ శాఖ అధికారులు వారి పరిధిలో ఉన్న పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ బి.ఉషా, డిప్యూటీ సీఈఓ సుందర వరదరాజన్, జెడ్పిటిసిలు భీంగల్ చౌట్‌పల్లి రవి, ఆర్మూర్ మెట్టు సంతోష్, నవీపేట్ సవిత, రెంజల్ మ్యాక విజయ, పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ ప్రభాకర్, ఈఈలు బావన్న, గ్రామీణ నీటి సరఫరా శాఖ, ఈఈలు, రోడ్డు భవనాల శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు, జిల్లా ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు రమేష్, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

- ఏడిఏ మల్లయ్య కాంపాటి మల్లయ్య

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని భీంగల్ ఏడీఏ కాంపాటి మల్లయ్య హెచ్చరించారు. మండలంలో వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని విత్తన డీలర్ల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన దుకాణాలలో గుర్తింపు పొందిన విత్తన కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు తీసుకొచ్చి రైతులకు అమ్మాలని అన్నారు. సీడు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని ఏవో నరసయ్య సూచించారు. కాల వ్యవధి దాటిన విత్తనాలను, పురుగుమందులను రైతులకు అమ్మితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు పురుగుమందులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నర్సయ్య, ఎస్సై వినయ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్: తనిఖీ చేస్తున్న అధికారులు

నిజామాబాద్‌రూరల్ : ఖానాపూర్‌లోని వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎఈఓ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో విత్తనాల కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. విత్తనాలు కొనేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అవి ప్యాకింగ్‌లో, లేబుల్స్ ఉన్నవి విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. లైసెన్సు ఉన్న డీలర్ల షాపు దగ్గరనే విత్తనాలను కొనుగోలు చేయాలని, అలాగే బిల్లును కచ్చితంగా తీసుకోవాలని పేర్కొన్నారు. బిల్లులను పంటలు పూర్తయ్యేవరకు దగ్గరనే ఉంచుకోవాలని తెలిపారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు కొర్వ రాజేంద్రప్రసాద్, ఎ.నరేందర్, పి.అబ్బన్న, కోర్వ గంగాధర్, పి.సాయికుమార్, గంగమల్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి..

ముప్కాల్ : మండల కేంద్రంలోని విత్తన 'సీడ్స్' దుకాణాలను మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్ స్థానిక ఎస్సై భాస్కరాచారీలు సంయుక్తంగా కలిసి తనిఖీలు చేపట్టారు. రానున్న వానకాలం సీజన్‌కు గాను రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాల్సిందిగా దుకాణ యజమానులకు సూచించారు. దుకాణంలో తప్పనిసరిగా ధరల పట్టిక, విత్తన నిల్వల బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. అలాగే రైతుకు విధిగా రసీదు ఇవ్వాలని ఆ రసీదులో విత్తన రకం, లాట్ నెంబరు, అమ్మిన బ్యాగులు వివరాలను పొందుపరుస్తూ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఆయా సీడ్స్ దుకాణాలలో రికార్డులను తనిఖీ చేశారు. విత్తన అమ్మకాల రిజిస్టర్ రాయాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై భాస్కరా చారి హెచ్చరించారు. రైతులు తీసుకున్న విత్తనాలకు సంబంధించిన రసీదును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్, స్థానిక ఎస్సై భాస్కరా చారీ, సీడ్స్ దుకాణాల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌రూరల్‌లో...



ముప్కాల్‌లో...

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి అందజేత

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని నాగపూర్ గ్రామానికి చెందిన తంబూరు మల్లేష్ కొంతకాలంగా చేతు నరాల సమస్యతో బాధపడుతున్నాడు. మెరుగైన చికిత్స, వైద్య సహాయం కోసం మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌ను సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.లక్ష 20 వేలు ఎల్ఓసి మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ఓసిని గురువారం మల్లేష్ కుటుంబ సభ్యులకు అందజేసినట్టు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ తెలిపారు.

జీవన్ సేవ వెల్‌నెస్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-బోధన్

జీవన్ సేవ వెల్‌నెస్ గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం బోధన్ పట్టణంలోని సెంట్ ఆంథోనిస్ హైస్కూల్‌లో మెగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు, మసాజ్ థెరపీ, ఆక్యూపెక్చర్ థెరపీ, నేచురోపతి చికిత్సలు అందించారు. అలాగే కీళ్ల నొప్పులు, బిపి, మధుమేహం, థైరాయిడ్, కిడ్నీ సమస్యలు, గుండె సమస్యలు, గ్యాస్ట్రిక్ సమస్యలు, చర్మ వ్యాధులు, లివర్ సమస్యలు, స్త్రీ ఆరోగ్య సంబంధ వ్యాధులకు, పక్షవాతం, అర్శమొలలు, నేత్ర సమస్యలు, ఊబకాయం, క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం సందర్భంగా బోధన్, ఎడపల్లి, నవీపేట్, రెంజల్, సాలురా మండలాల నుంచి రోగులు తరలివచ్చారు. ఈ శిబిరంలో 400 పైగా రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో న్యూరో పెయిన్ థెరపీ నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్, నేచురోపతి వైద్యులు డాక్టర్ నాగనాథ్, డాక్టర్ సదానంద్‌గౌడ్, నేచురోపతి హకీం, సిబ్బంది గీత, సంజన తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయరే..?

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం
- నారుమడులకు ఆలస్యమవుతోందని ఆవేదన

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి రాంపూర్ రహదారి పక్కన ఇటీవల వీచిన ఈదురుగాలులకు ట్రాన్స్‌ఫార్మర్ కింద పడిపోయి వారం రోజులు గడుస్తోంది. అయినా సంబంధిత ఏఈ పట్టించుకోవడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఉండే బోరుమోటర్ల రైతులు మాట్లాడుతూ.. నారు మడి సిద్ధం చేసుకున్నా.. నీరు లేక పగుళ్ల వస్తున్నాయని తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈని పలుమార్లు కలిసినప్పుడు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. రాయకూర్ శివారులో కరెంటు అంతరాయం కలిగినప్పటికీ ఇప్పటివరకు చర్యలు చేపట్టడం లేదని రైతుల వాపోయారు. ఏఈ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, కావాలని గతంలో జరిగిన ఘటన వలన కక్షపూరితంగా ఏఈ వ్యవహరిస్తున్నారని రైతు రాజు పేర్కొన్నారు. తక్షణమే కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఏఈ కృష్ణను వివరణ కోరగా రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. రుద్రూరు మండలంలో కరెంట్ సరఫరా పనులు చేయడం వల్ల కోటగిరిలో కొంత ఆలస్యం అవుతుందన్నారు. మా వంతు బాధ్యతను నెరవేరుస్తామని పేర్కొన్నారు.



ఎండిపోతున్న నారుమడి



విరిగిపడ్డ స్తంభాలు



కిందపడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
5
శుక్రవారం | మే 31, 2024 | www.navatelangana.com

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవతెలంగాణ-బోధన్

బోధన్ మున్సిపల్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ ప్రాంతంలో బుధవారం రాత్రి దొంగలు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడి తులంన్నర బంగారం, రూ.15 వేల నగదు దొంగిలించినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు. ఎప్పటిలాగే ఇంటికి తాళం వేసి మేడపై నిద్రించినట్లు బాధితుడు శ్రీకాంత్ తెలిపారు. ఈ క్రమంలో దొంగలు బుధవారం రాత్రి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో వస్తువులు చిందరవందర చేసి బంగారం, రూ.15వేల నగదు దోచుకుపోయినట్టు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



నటరాజ నృత్యానికేతన్‌లో గజ్జె పూజ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి గంగ హాస్పిటల్ ఎదురుగా గల నటరాజ నృత్యానికేతన్‌లో గురువారం గజ్జె పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య గురువు భాశెట్టి మృణాళిని మాట్లాడుతూ చిన్నారులకు వేసవి సెలవులలో చదువుతో పాటు కూచిపూడి, భరతనాట్యం తదితర నృత్యాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.



గజ్జెపూజ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

ప్రభుత్వ పాఠశాలలే ఉత్తమం

- 3 నుంచి 11వరకు బడిబాటలో భాగంగా ప్రభుత్వ స్కూళ్లల్లో అడ్మిషన్‌లు చేయించాలి
- అధికారులతో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

ప్రస్తుత విద్యా సంవత్సరంలో బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించుటకు జూన్ 3 నుండి 11 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న బడిబాట కార్యక్రమంలో అందరు భాగస్వాములై విజయవంతం చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో జూన్ 3 నుండి 11 వరకు చేపట్టనున్న బడిబాట, అనంతరం జూన్ 12 నుండి 19 వరకు రోజువారీ చేపట్టనున్న కార్యక్రమాలపై ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను అధికారులకు వివరించి సమర్థవంతంగా అమలుచేయుటకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 3 నుండి 11 వరకు చేపడుతున్న బడిబాట కార్యక్రమాలలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, తహసీల్దార్లు, ఎంపిపిలు, ఎంపిఓలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులను, స్వయం సహాయక సంఘాలు, విలేజి ఆర్గనైజేషన్లు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ తమ పరిధిలోని గ్రామాలలో చదువుకు దూరంగా ఉంటున్న బడిఈడు పిల్లలను గుర్తించి దగ్గరలోని అంగన్వాడీలు, పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రధానంగా ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వ్యత్యాసం, ఖర్చు చెప్పి ప్రభుత్వ పాఠశాలలే ఉత్తమమని తల్లిదండ్రులలో వారిలో నమ్మకం కలిగించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలు దీటుగా ప్రభుత్వ బడులలో మౌలిక వసతులు కల్పిస్తూ డ్యూయల్ డెస్క్ లు, డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారని, పాఠశాలలు మనకు అందుబాటు దూరంలో ఉంటాయని, అక్కడ ఉన్నత చదువులు చదివి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు బుక్ లు, దుస్తులు ఇస్తారని, నాణ్యమైన భోజనం పెడతారని, ఒక్క పైసా ఫీజు కూడా చెల్లించవలసిన అవసరం లేదని, పూర్తిగా ఉచిత విద్య లభిస్తుందని, ప్రభుత్వ బడులలో చదువుకున్న వారే ఉన్నత స్థానాలలో ఉన్నారన్న విషయం తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. ఇక ప్రైవేట్ పాఠశాలలో ఇంటర్, డిగ్రీ చేసిన ఉపాధ్యాయులు ఉంటారని, దూరంగా ఉండే పాఠశాలకు స్కూల్ బస్సులో వెళ్లాలని, పుస్తకాలు,దుస్తులు అన్ని కొనవలసి ఉంటుందని, నెల నెలా ఫీజు చెల్లించవలసి ఉంటుందని అయినా పిల్లల భవిష్యత్తు గ్యారంటీ ఉంటుందన్న నమ్మకం లేదని, అవే డబ్బులను ఫిక్సెడ్ డిపాజిట్ చేస్తే పిల్లల ఉన్నత చదువులకు వస్తాయని వివరించాలన్నారు.

జూన్ 3 న బడిబాట కార్యక్రమంపై విలేజి ఆర్గనైజేషన్లతో సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. 4న ఇంటింటికి తిరిగి బడిఈడు పిల్లలను గుర్తించాలన్నారు. 5 నుండి 10 వరకు అంగన్వాడీ కేంద్రాలకు సందర్శించి తలిదండ్రులలో చదువుపట్ల అవగాహన కలిగించి పిల్లలను బడికి పంపేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 11 న గ్రామ సభ ఏర్పాటు చేసి 3 నుండి 10 వరకు చేపట్టిన కార్యక్రమాలను చర్చించాలన్నారు. 12న పండుగ వాతావరణంలో పాఠశాలలు పున:ప్రారంభించి నూతన విద్యార్థులకు స్వాగతం పలకాలన్నారు. 13 న తొలిమెట్టు, 14 న సామూహిక అక్షరాభ్యాసం, 15 న గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్, 18 న డిజిటల్ తరగతులపై అవగాహన, 19 న ఆటలపోటీలు నిర్వహించాలన్నారు. చక్కటి కార్యాచరణతో పక్కాగా ప్రణాళిక రూపొందించి అధికారులందరూ సమన్వయంతో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో డీఈఓ రాజు, లింగం, పంచాయత్ రాజ్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కొనుగోలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కొనుగోలు పూర్తి చేయాలి

అదేశించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-బీబీపేట్

బిబిపేట మండలం రామ్ రెడ్డి పల్లి, కోనాపూర్ దాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సందర్శించారు. శుక్రవారం సాయంత్రం లోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిలువ ఉంచిన ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని కేంద్రాల ఇన్చార్జిలను ఆదేశించారు. బిబిపేటలోని శ్రీనివాస ఆగ్రో రైస్ మిల్లును జిల్లా ఇంచార్జ్ పౌరసరఫరాల మేనేజర్ నిత్యానందం సందర్శించారు. 7 లారీలు మిల్లు పాయింట్ వద్ద నిలిచి ఉన్నందున ధాన్యం అన్లోడింగ్ వేగవంతం చేయాలని సూచించారు. 53,790 మంది రైతుల నుంచి 3.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. వీటికి సంబంధించి రూ.683 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ.632 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు.327 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ పూర్తయిందని తెలిపారు. 23 కేంద్రాలలో ధాన్యం సేకరణ ప్రక్రియ త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు.

మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.8 లక్షల చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గత సంవత్సరం డిసెంబర్ 24న అనారోగ్యంతో మరణించిన ఐదో టౌన్ కానిస్టేబుల్ 976 కె.రామాంజనేయరెడ్డి కుటుంబానికి భద్రత ఎక్స్‌గ్రేషియా రూపంలో గల రూ.8,00,000 చెక్కును పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ చేతుల మీదుగా కానిస్టేబుల్ సతీమణి కె.రోజాకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ట్రెయినీ ఐపీఎస్ బి.చైతన్యరెడ్డి, అదనపు డి.సి.పి (అడ్మిన్) బి.కోటేశ్వరరావు, ఎ.ఓ శ్రీనివాస్‌రావు, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు, డి.పి.ఓ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తకు బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-మెండోరా

మండలంలోని సోన్‌పేట్ గ్రామానికి చెందిన తోపారం రమేష్ పోచంపాడ్ గోదావరి నదిలోకి చేపల వేటకు వెళ్ళి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. రమేష్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కావడంతో ఆయనకు బిఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం కలిగి ఉండటంతో వారి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ రెండు లక్షల ఇన్సూరెన్స్ బీమా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి బురుకల సుకన్య కమలాకర్ మృతుని కుటుంబీకులకు రెండు లక్షల ఇన్సూరెన్స్ బీమా చెక్కును అందజేశారు. నిరుపేద కుటుంబానికి బీమా అందజేసిన మాజీ సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి కుటుంబీకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా కార్యకర్తలను కడుపులో పెట్టి చూసుకుంటుందని ప్రతి ఒక్క నాయకులకు, కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధీమాను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, పార్టీ శ్రేణులు ధోని, సత్తన్న, ఎర్ర.మల్లేష్, సుంకరి సాయేందర్, బురుకల నరేష్, బర్గడి సుకేష్, మాదిగుల ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి యువకుడు మృతి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయి కింద పడడంతో తీవ్రగాయాలైన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన మాధవ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన సందీప్ (21) అనే యువకుడు నిజామాబాద్ మున్సిపల్ ఆఫీసులో కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. అందులో భాగంగా తన విధులు ముగించుకొని బుధవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తున్న క్రమంలో మాధవ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో కుక్క అడ్డువచ్చింది. దానిని తప్పించబోయి బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలవడంతో మృతిచెందాడు. నిజామాబాద్ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఎడపల్లి



అన్సార్ మృతదేహం

మండలంలోని తానాకలాన్ గ్రామ శివారులో ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. నిజామాబాద్‌కు చెందిన అన్సార్ (35) అనే వ్యక్తి ఎల్లారెడ్డి నుంచి తానాకలాన్ గ్రామం ద్వారా నిజామాబాద్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో తానాకలాన్ గ్రామం వద్ద ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన అన్సారీ అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పనులు పరిశీలించిన ఎంపిడిఓ

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలో చేపడుతున్న కంపోస్టు షెడ్, క్రిమిటోరియా, శానిటేషన్ పనులను ఎంపిడిఓ బాలకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలని కార్యదర్శి సైఫోద్దీన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా సదరం క్యాంపులు

- జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆదికారి సాయ గౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రతి నెల జిల్లాలోని వికలాంగుల నిర్ధారణ కొరకు సదరం క్యాంపులను నిర్వహించనున్నట్టు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆదికారి సాయ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా జూన్ 5, 12, 19న సదరం క్యాంపును ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో నిర్వహించనున్నట్టు తెలిపారు. సదరం స్లాట్‌ను ఈనెల 31న ఉదయం 11:30 గంటలకు విడుదల చేయనున్నట్టు వివరించారు. ఇదివరకే మీ సేవ ద్వారా సదరం స్లాట్ బుక్ చేసుకుని, వేయిటింగ్ లిస్టు వచ్చిన దివ్యాంగుల రిజిస్టర్డ్ మొబైల్‌కి ఎస్ఎంఎస్ ద్వారా సదరం క్యాంపు తేదీ, స్థలం వివరాలు పంపిన రోజు మాత్రమే హాజరు కావలసిందిగా కోరారు. జూన్ నెలలో 3 సదరం క్యాంపులకు 5 రకాల కేటగిరీల లోకోమోటర్, వినికిడి లోపం, మానసిక అనారోగ్యం, మానసిక మాంద్యము, దృష్టి లోపం వికలాంగులకు మొత్తం 390 సదరాలను విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఇక నుండి సదరం స్లాట్ బుకింగ్ నిరంతర ప్రక్రియ, మీసేవ ద్వారా ఎవరైనా ఎప్పుడైనా స్లాట్ బుక్ చేసుకోవచ్చునని, స్లాట్ బుక్ చేసుకోగానే, స్లాట్ లు అందుబాటులో ఉన్నచో, సదరం క్యాంపు తేది, స్థలం వస్తుందని, స్లాట్ అందుబాటులో లేనిచో వెయిటింగ్ లిస్టు వస్తుందని తెలిపారు. సదరం క్యాంపు షెడ్యూల్ ఇవ్వగానే వెయిటింగ్ లిస్టులో ఉన్న వారికి స్లాట్ ఆటోమేటిక్‌గా బుకింగ్ అవుతుందని, స్లాట్ బుక్ కాగానే వారి రిజిస్టర్డ్ మొబైల్ నెంబరుకు సదరం క్యాంపు తేదీ, స్థలం వివరాలు ఎస్ఎంఎస్ పంపబడుతుందని పేర్కొన్నారు. ఈ ఎస్ఎంఎస్ ప్రకారమే సదరం క్యాంపుకు హాజరు కావాలని, లేకుంటే సదరం స్లాట్ ఆటోమేటిక్‌గా క్యాన్సల్ అవుతుందని తెలిపారు. లబ్ధిదారుడు సదరం క్యాంపునకు హాజరయ్యే సమయంలో సంబంధిత మెడికల్ రిపోర్టులు, ఎక్స్‌రే, ఎంఆర్ఐ, సిటీ స్కాన్, రిపోర్టులు, వినికిడి లోపం గల వారు బీరా టేస్ట్ రిపోర్టులు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. లేనియెడల డాక్టర్ అసెస్మెంట్ చేయబడదు అని తెలిపారు. లబ్ధిదారునితో పాటు ఒక వ్యక్తికి మాత్రమే ప్రవేశం ఉంటుందని వివరించారు. సదరం సర్టిఫికేట్ రెన్యూవల్ ఉన్నవారు ఓల్డ్ సదరం సర్టిఫికేట్‌తో పాటుగా సంబంధిత మెడికల్ రిపోర్టులు తప్పనిసరిగా తీసుకురావాలని, సదరం సర్టిఫికేట్ గడువు ముగిసిన లబ్ధిదారులు త్వరగా రెన్యూవల్ చేసుకోవాలని, లేనియెడల ఆసరా పింఛన్‌లు నిలిపివేయనున్నట్టు వికలాంగులకు సూచించారు.

అవసరం మేరకు ఎరువుల నిల్వలున్నాయి

- జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్

నవతెలంగాణ-ధర్పల్లి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

రైతులకు కావాల్సిన ఎరువులు అవసరం మేరకు పూర్తిస్థాయిలో నిల్వలున్నాయని, రైతులు తమ అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చెయ్యాలని జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ సూచించారు. గురువారం మండలంలోని హొన్నాజిపేట్, ప్రాజెక్ట్ రామడుగు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్ల ఎరువుల దుకాణాలను ఆయన పరిశీలించారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాలలో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించి వారి స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వానాకాలం పంటకు కావాల్సిన ఎరువులు సరిపడా జిల్లాలో నిల్వ ఉన్నాయని, ఎరువులకు ఎటువంటి కొరత రాకుండా ముందస్తు ప్రణాళిక తయారుచేసి, రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. అవసరం కన్నా ఎక్కువ మొత్తంలో యూరియా ఎరువులు కొనుగోలు చేసి నిలువ చేయకూడదని పంటకు వేయాల్సిన సమయంలో మాత్రమే కొనుగోలు చేయాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమం ఇంచార్జి మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాల సాహిత్య సమ్మేళనంలో వక్తగా ప్రవీణ్ శర్మ



ప్రవీణ్‌శర్మను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల

తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల సాహిత్య సమ్మేళనంలో "పాఠశాలలో గ్రంథాలయం" "బాలసాహిత్యం" అనే అంశంపై తడపాకల్ తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ వక్తగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు భాసా సాహిత్యం పట్ల మక్కువ పెంచడానికి, పాఠశాలలో గ్రంథాలయాలు చాలా వరకు ఉపయోగపడతాయని, ఇవి విద్యార్థుల సంస్కరణలకు బాగా దోహదపడతాయని తన ప్రసంగంలో వివరించారు. అదేవిధంగా సారస్వత పరిషత్ వారు ఆవిష్కరించిన తెలుగు భాషా సాహిత్య వైభవం అనే పుస్తకంలో ప్రవీణ్ శర్మ రాసిన వ్యాసానికి, వక్తగా కార్యక్రమంలో పాల్గొన్నందుకు సాహిత్య పరిషత్తు అధ్యక్షులు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, ప్రవీణ్‌శర్మను సన్మానించారు.

గ్రూప్1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

ఇరు జిల్లా కలెక్టర్‌లు రాజీవ్‌గాంధీ, జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-నిజామాబాద్/కామారెడ్డి

జూన్ 9 న నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆదేశాలననుసరిస్తూ పకడ్బందీగా నిర్వహించాలని ఇరు జిల్లా కలెక్టర్‌లు రాజీవ్‌గాంధీ హనుమంత, జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు.

కామారెడ్డి జిల్లాలో 4,797 మంది అభ్యర్థులు 12 కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారని అన్నారు. పరీక్షలు సాఫీగా నిర్వహించుటకు నియమించిన చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు, రూట్ అధికారులు ముందుగా ఆయా కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులు కల్పించాలని, ప్రవాహారి గోడ లేని కేంద్రాలలో తగు బందోబస్తు ఉండేలా చూడాలన్నారు. కేంద్రం పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ చికిత్సకు ఏఎంఎం లను ఏర్పాటు చేయాలని, సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని అన్నారు.

మతం పేరుతో మనువాదం వైపు బీజేపీ అడుగులు

- సిపిఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న ప్రజాపంథా రాష్ట్ర నాయకులు

భౌతికవాద చరిత్రను మార్చే కుట్రలకు బిజెపి పాల్పడుతుందని సమాజాన్ని పురోగమనం నుంచి తిరోగమనం వైపు తీసుకెళ్తుందని అని సిపిఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు హన్మేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పిప్రి గ్రామంలో డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ "రాజకీయ శిక్షణ తరగతులు" నిర్వహించారు. డివిజన్ కార్యదర్శి బి.దేవారం అధ్యక్షతన రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు "మానవ సమాజం – పరిణామ క్రమం"పై మాట్లాడారు. సమాజంలో మానవ పరిణామ క్రమాన్ని మాతతత్వ బిజెపి సమాజాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్తుందన్నారు. పెట్టుబడిదారుల దోపిడీని కాపాడడానికే బావవాదాన్ని ముందుకు తెచ్చారని తెలిపారు. కులం, మతం అన్న తప్పుడు భావాలను సమాజంపై రుద్దుతున్నారని చెప్పారు. మతరాజకీయాలను బిజెపి తన ఎజెండాగా తీసుకొని భారతదేశాన్ని మనువాదం కుట్రలోకి తీసుకెళ్లుందని వివరించారు. మోడీ వచ్చాక దేశంలో మతమౌఢ్యం, మూఢ విశ్వషాలు పెరిగాయని చెప్పారు. మత రాజకీయాలను తెచ్చి పెరుగుతున్న అధిక ధరలు, చమురు ధరలు, దారిద్ర్యం పెరిగిన పట్టించుకోలేని స్థితికి తెచ్చారని వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడమే తన కర్తవ్యంగా మోడీ తీసుకున్నారని అన్నారు. దేశాన్ని ఆదాని, అంబానీలకు కారుచౌకగా అమ్మడం దేశ సేవగా చెప్పుకుంటున్నారని వివరించారు. శ్రమజీవులు బిజెపి ఆశాస్త్రియ భావాలను త్రిప్పికొట్టి శాస్త్రియ భావాలను పెంపోందించుకోవాలని అన్నారు. సమాజ పరిణామక్రమాన్ని శాస్త్రియ దృక్పథం అన్న ద్రుష్టికోణంతో చూడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏఐపికెఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రభాకర్, రాష్ట్రప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ముత్తెన్న, ఉపాధ్యక్షురాలు సత్తెమ్మ, పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షులు నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, పివైఎస్ జిల్లా అధ్యక్షులు అనిస్, ఏఐపికేఎస్ జిల్లా అధ్యక్షులు సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్, సిపిఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) మండలాల సంయుక్త కార్యదర్శి కిషన్, డివిజన్, వివిధ మండలాల నాయకులు ఆర్.దామోదర్, సాయిరెడ్డి, అరవింద్, రమేష్, కిషోర్, ఆకుల గంగారాం, రాజన్న, అశోక్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.